అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 25 మే 2023

పీహెచ్‌సీ తనిఖీ


వైద్య, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డా.చంద్రశేకర్

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని పిహెచ్‌సి కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్వో వైద్యులు చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పి హెచ్ సి లోని పలు రికార్డులను పరిశీలించారు. నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఓపి, తదితర వివరాలు పై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండ్రికాయల వేటకు వెళ్లి ఒకరు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

ఎండ్రి కాయల వేటకు వెళ్లి ఒకరు మృత్యువాత పడ్డ ఘటన రామారెడ్డి గ్రామ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్గుల గ్రామానికి చెందిన గంగారపు పోచయ్య (32) రోజు మాదిరిగా ఈనెల 14వ తేదీన ఎండ్రికాయల వేటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు.. బంధువుల ఇండ్లలో, చుట్టుపక్కల వెతుకుతుండగా రామారెడ్డి గ్రామ శివారులోని రెండు వాగుల గడ్డవాగులో ప్రమాదవశాత్తు పడి ఉన్నాడు. ఫిట్స్ ఉండటం ఈత రాకపోవడంతో వేటకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందినట్టు భార్య గంగారపు పోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ అనిల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోళ్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి

- తడిచిన రంగు మారిన ధాన్యం సైతం కొంటున్నాం
- మంత్రి గంగుల కమలాకర్ సూచన
- జిల్లాలో 5.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి : కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌లు, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

ధాన్యం కొనుగోళ్ల దాదాపుగా చివరి దశకు చేరుకున్న ప్రస్తుత తరుణంలోనూ క్షేత్ర స్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ జిల్లా యంత్రాంగాలకు సూచించారు. బుధవారం ఆయన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ వి.అనిల్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు వాటి తరలింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సీజన్‌లో ముందస్తుగానే ఏప్రిల్ 10వ తేదీ నుండే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి గుర్తు చేశారు. గత చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. గతేడాది 28.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల వరకు అదనంగా 38.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. నాలుగున్నర లక్షల మంది రైతుల నుండి ధాన్యం సేకరించగా, ఈసారి 4.55 లక్షల మంది రైతుల వద్ద ధాన్యం సేకరించామని తెలిపారు. ధాన్యం దిగుబడులకు అనుగుణంగా అదనంగా 400 కొనుగోలు కేంద్రాలను సైతం అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతులకు ఊరటనందించిందని అన్నారు. 21 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశామన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల పాలకవర్గాల తోడ్పాటుతోనే ఇంత పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలను కొనుగోలు చేయడం సాధ్యపడిందని మంత్రి గంగుల కమలాకర్ ఈ సందర్భంగా వారిని అభినందించారు. అయితే, ప్రస్తుతం మరో పక్షం రోజుల పాటు మరింత శ్రద్ధాసక్తులతో పనిచేస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. రైతుల నుండి ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ, వాటిని భద్రపరిచేందుకు వీలుగా అవసరమైన చోట గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి తరుగు తీయకుండా రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం రవాణాకు ఆటం కాలు తలెత్తకుండా అదనపు వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు.

5.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 5 . 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో 90 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేసేందుకు జిల్లాలోని రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఎఫ్‌సీఐ అనుమతించడం లేదన్నారు. ఈ విషయమై మంత్రి స్పందిస్తూ, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిర్దేశిత లక్ష్యం మేరకు రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను అందించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్ఓ చంద్రప్రకాష్, డీసీఓ సింహాచలం, సివిల్ సప్లైస్ డీఎం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఎదుట ధాన్యం గుమ్మరించిన రైతు

- తడిచిన, మొలకెత్తిన ధాన్యం కొనట్లేదని ఆవేదన



నవతెలంగాణ-బోధన్

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్న తనకు ప్రకృతి వైపరీత్యంతో పాటు సొసైటీ, రైస్‌మిల్లర్‌ల తీరుకు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రంగు మారడం, మొలకెత్తడం జరిగాయి. దాంతో రైతులు పలుచోట్ల నిరసన చేయడంతో ప్రభుత్వ పెద్దలు అలాంటి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతుల హర్షం చేశారు. కానీ రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాంతో విసుగు చెందిన ఓ రైతు మొలకెత్తిన ధాన్యాన్ని సొసైటీ ఎదుట కుమ్మరించి తన ఆవేదన వ్యక్తం చేశాడు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రానికి చెందిన రైతు కుంట్ల సాయిలు తన ధాన్యాన్ని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తీసుకోవడం లేదని విసుగుచెంది బుధవారం ఒక ట్రాలీ లోడు ధాన్యాన్ని సొసైటీ ఎదుట గుమ్మరించాడు.

వివరాలు మెయిన్‌లో..

వీవోఏలకు కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్


వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్, వీవోఏలు

నవతెలంగాణ-రామారెడ్డి

వీవోఏలు 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని, వీవోలను కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రామారెడ్డి మండలంతో పాటు మాచారెడ్డి మండలంలో వీవోఏల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసును సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్‌తో కలిసి మండల ఐకెపి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 జిల్లాల్లో గత 37 రోజులు వీవోఏలు హక్కుల కోసం మీరు అధిక సమ్మె నిర్వహించిన ప్రభుత్వం స్పందించకపోవడం, ప్రభుత్వం నిమ్మకు నీరు తినట్లు ఉండటం మంచిది కాదని, పనికి తగిన వేతనం వివో ఏలకు అందించాలని, ప్రభుత్వం స్పందించే వరకు నిరుపదిక సమ్మెను 28 జిల్లాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీవోలా మండల కార్యవర్గ సభ్యులు, వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్టాపనకు హాజరైన మంత్రి అల్లోల కరుణాకర్‌రెడ్డి


ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో బ్రాహ్మణపల్లి గ్రామంలో మూడు రోజులుగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ రెడ్డితోపాటు, జిల్లా జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ జిల్లా అధికారు, నాయకులు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలో గత మూడు రోజులుగా జరిగిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎలాంటి అలజడు లేకుండా ఎడపల్లి ఎస్సై పాండేరావు భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షణ నిర్వహించారు. స్థానిక గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టాపించి మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రికి వీవోఏల వినతి

మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డికి వీవోఏలు వినతిపత్రం అందజేశారు. నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదని, సీఎం దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి


కొచ్చేరి మైసమ్మ ఆలయంలో వసతిగృహాల నిర్మాణానికి శంకుస్థాప

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మానసిక ప్రశాంతత, భక్తి భావాన్ని కలిగించే మైలారం కొచ్చేరీ మైసమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా 1కోటి 60 లక్షల రూపాయలతో భక్తుల సౌకర్యం మేరకు వసతి గృహాలకు బుధవారం ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న కొచ్చేరీ మైషమ్మ అలయంనుఅభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. వారానికి మూడు రోజులు పాటు భక్తులు ఇతర ప్రాంతాల నుండి వందలాది సంఖ్యలో భక్తులు తరలిరావడం, భక్తులకు సరిపడు సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు కావడంతో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే సీఎం కేసీఆర్ ఎన్నో ఆలయాలకు కోట్ల రూపాయలతో అద్భుత క్షేత్రలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ సమీపంలో కోటి రూపాయలతో వసతి గృహాలు వంటశాలలు ఇతర భవనాలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న భూమిని లేఔట్ చేసుకొని రోడ్లు వేయాలన్నారు. వీరి వెంట ఎంపీపీ పాల్త్య విఠల్ , సర్పంచ్ ఫోరం కన్వీనర్ రాము, గ్రామ సర్పంచ్ యశోద మహేందర్, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, సుదీర్ బాబు, గంగారాం, పెర్క శ్రీనివాస్, జిల్లా రైతు కన్వీనర్ అంజిరెడ్డి, ఎజాజ్, నాయకులు కంది మల్లేష్, కాలీల్, సాయి రాం యాదవ్, సాయిలు యాదవ్, వివిధ శాఖల అధికారులు, ఇంజనీర్ అధికారులు తదితరులు ఉన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు


ఎస్సీ వాడలో నేలకొరిగిన స్తంభం


విరిగిపడ్డ చెట్టు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం వేళ ఒక్కసారిగా ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి, చెట్లు విరిగి ప్రధాన రహదారిపై పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మండల కేంద్రంలోని ఎస్సీవాడలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరగగా చెట్టు విరిగి ప్రధాన రహదారిపై పడింది. దీంతో బాన్సువాడ-బిచ్కుంద రహదారిపై రాకపోకలు స్తంభించాయి. వర్షం పడుతున్న సమయంలో చెట్టు, విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కింద పడడం ఎప్పుడు జన సంచారంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాద తప్పిందని స్థానికులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టారు. రోడ్డుపై పడ్డ చెట్టును పక్కకు తొలగించడంతో రాకపోకలు ప్రారంభం అయ్యాయి. దీంతో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మహిళా రెజ్లర్‌లను వేధించిన బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలతా డిమాండ్
- దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళా రెజ్లింగ్ క్రీడాకారులకు వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్‌లకు ఐద్వా మద్దతు ఉంటుందని తెలిపారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ బ్రిజ్ భూషణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై విపరీతమైన హింస పెరిగిందని అన్నారు. మహిళలపై హత్యలు, లైంగిక దాడులకు అడ్డు అదుపు లేకుండా ఎక్కడబడితే అక్కడ విచ్చల విడిగా మహిళలపై దాడులకు పాల్పడుతు న్నారని అన్నారు. దేశానికి పతకాలు సాధించి పెట్టిన రెజ్లింగ్ క్రీడాకారులకే రక్షణ లేకపోతే మామూలు మహిళలకు ఏ రకంగా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందో మనం అర్థం చేసుకోవచ్చని అలాగే విపరీతమైన ధరలు పెంచుతూ మహిళలపై ఆర్థిక భారాలు మోపుతూ అణిచివేతకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రెజ్లింగ్ క్రీడాకారులకు రక్షణ కల్పించి బ్రిజ్ భూషణ్ అరెస్టు చేయకపోతే ఐద్వా మహిళా సంఘంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న అరాచకాలను దాడులను నివారించటానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని లేనియెడల మహిళలకు భద్రత కరువవుతుందని సమాజంలో అశాంతి అరాచకం పెరిగి అలజడలు వస్తాయని ప్రభుత్వ విధానాల్లో మార్పు వచ్చేంతవరకు మహిళలు ఐక్యంగా సంఘటిత పోరాటాలు చేయాలని అప్పుడే ఈ ప్రభుత్వాలు స్పందిస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బెజ్జిగం సుజాత, జిల్లా అధ్యక్షురాలు అడవల అనిత, జిల్లా ఉపాధ్యక్షులు కటారి లావణ్య, బొప్పిడి అనసూయ జిల్లా నాయకులు రజియా, శివరంజని, మీరా, కళావతి, శ్రీదేవి తదితర నాయకులు పాల్గొన్నారు.

మంత్రి వేముల అండదండలతోనే మైనింగ్ మాఫియా

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి ఆరోపణ


కంకర క్రషర్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్

పచ్చని పంట పొలాల మధ్యలో ఎలాంటి క్వారీలను గాని క్రషర్లను గాని నడపకూడదని పర్యావరణానికి సంబంధించి మైనింగ్ చట్టం లో ప్రాథమిక సూత్రం అమలులో ఉన్నప్పటికీ వాటిని తుంగలోకి తొక్కి క్వారీ, క్రషర్ పేరుతో మైనింగ్ కు పాల్పడుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బినామీల పైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి వేముల అండదండలతోనే మైనింగ్ మాఫియా నడుస్తోందని ఆరోపించారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామంలో ఉన్న క్వారీ మరియు క్రషర్లను సందర్శిం చారు. అనంతరం మాట్లాడారు. కేవలం 13వేల వేల క్యూబిక్ మీటర్ల మైనింగ్ కొరకే అనుమతి తీసుకున్నప్పటికీ కానీ ఇప్పటికే దాదాపు 15 లక్షల క్యూబిక్ మీటర్ల లోతుకు మైనింగ్ చేశారని ఆయన ఆరోపించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఇక్కడ అక్రమ మైనింగ్ ద్వారా దాదాపు 100 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని దానిలో ప్రతి ఒక్క రూపాయి వేముల ప్రశాంత్ రెడ్డి గారి ఇంటికే వెళ్లిందని ఆయన ఆరోపించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ సహజ వనరులను కొల్లగొడుతూ పన్నులను ఎగ్గొడుతూ పచ్చని పంట పొలాలను నాశనం చేస్తున్న క్వారీ నిర్వాహకులను అరెస్టు చేసి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని అలాగే క్వారీ శాశ్వతంగా మూసివేయాలని వారి ద్వారా పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరి హారం అందించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించే వరకూ నిరసనలు

- టీయూలో లా కళాశాల వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన


నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తమకు ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించే వరకూ ఆందోళనలు, నిరసనలు తెలుపుతూనే ఉంటామని టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని టీయూలోని లా కళాశాల ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి దత్త హరి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరసనలు తెలుపుతున్నారని చెప్పారు. కాంట్రాక్టు లెక్చరర్‌లను రెగ్యులర్ చేస్తామని గత అసెంబ్లీ సమావేశంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నేరవేర్చాలన్నారు. జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ కళాశాల లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, వీఆర్ఏలను ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీలు చేసి కాంట్రాక్ట్‌గా ఉండటం బాధాకరమని వెంటనే తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ ప్రవీణ్ , డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ సందీప్, డాక్టర్ నరసింహులు, డాక్టర్ ఆనంద్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సురేష్, డాక్టర్ డానియల్, డాక్టర్ జలంధర్, డాక్టర్ దేవర రాజు శ్రీనివాస్, డాక్టర్ నాగేశ్వరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 191 మంది క్రీడాకారులు ఎంపిక

- అక్కడా సత్తా చాటాలి : స్పీకర్


విజేతలకు సర్టిఫికేట్‌లు, బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా నుంచి 191 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులలో నెలకొన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం కప్ క్రీడలను రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేశారని చెప్పారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో నైపుణ్యాలు ప్రదర్శించి ప్రథమ బహుమతులు పొందాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులను రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ శోభ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, డిఇఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో సాయా గౌడ్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చోటాభీమ్



• 4.3కేజీల బరువుతో బాబు జననం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల లైఫ్ హాస్పిటల్‌లో 4.3కిలోల బరువుతో సుప్రియ అనే మహిళ మగ బాబుకు జన్మనిచ్చింది మొదటి కాన్పు కావడం, లోపల బిడ్డ బరువు అధికంగా ఉండడంతో నార్మల్ డెలివరీ సాధ్యం కాలేదని హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి రెడ్డి రిస్క్ తీసుకొని తల్లి బిడ్డలను కాపాడారు. ఉమ్మనీరు పూర్తిగా లేని సందర్భంలో ఎమర్జెన్సీ సెక్షన్ చేసి ప్రాణాలు కాపాడటం అభినందనీయమని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భాను రామగిరి బుధవారం తెలిపారు. వైద్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె చెల్లించిన తహసిల్దార్ కార్యాలయం

నవతెలంగాణ ఎఫెక్ట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కార్యాలయాన్ని ఖాళీ చేయండి.. తాళం వేస్తం అనే శీర్షికన ఈ నెల 10న నవతెలంగాణలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి ఏడాదికి సంబంధించిన తహసీల్దార్ కార్యాలయం అద్దెను బుధవారం చెల్లించారు. ఇంకా కొన్ని నెలల అద్దె చెల్లించవలసి ఉందని, ఇక నుండైనా నెలనెలా అద్దెకు సంబంధించిన డబ్బులను అందజేయాలని అన్నారు. ప్రతి నెల అందజేసే 10వేల రూపాయలు ఏ మూలన సరిపోవడం లేదని గృహ యజమాని కోరుతున్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-వేల్పూర్/నవీపేట్

మండలంలోని పిఏసీఎస్ పడగల్ పరిధిలో సబ్సిడీ జిలుగ విత్తనాలు రైతులకి అందజేశారు. 30 కిలోల సంచి సబ్సిడీ పోను రైతులు 843 రూపాయల చెలించి తీసుకోవాలని 30 కిలోల సంచి రెండున్నర నుండి మూడు ఏకరాలకి వాడుకోవాలని, పొలంలో విత్తనాలు చల్లిన 25-30 రోజులలో మొక్క పెరిగి పూత దశకి వస్తుందని అన్నారు. ఈసమయంలో మొక్కలను రోటవేటర్‌తో పొలంలో కలియ దున్నాలన్నారు. జీలుగవల్ల రెండుశాతం నత్రజని మొక్కలకి అదనంగా లభిస్తదని, జింక్, మాంగనీస్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో బింగల్ డివిజన్ ఎ డి ఎ కె మల్లయ్య, మండల వ్యసాయాధికారి నర్సయ్య, పాక్స్ పడ్గల్ ఛైర్మన్ హన్మంతు రెడ్డి , సర్పంచ్ వర్షిణి రాజ్ కుమార్, ఎంపిటిసిలు విజయ రాజేందర్ మరియు హేమలత శ్యామ్ రావు , సీఈఓ మోహన్, పాక్స్ డైరెక్టర్స్, ఏఈఒ ప్రశాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

నవీపేట్: మండలంలోని బినోల సొసైటీలో జీలుగ విత్తనాలను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లుకొని భూసారాన్ని పెంపొందించుకొని అధిక దిగుబడులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పితాంబర్, సొసైటీ వైస్ చైర్మన్ బాబర్, వ్యవసాయ అధికారి సురేష్ గౌడ్, బుచ్చన్న, విజయ్ డైరెక్టర్లు మరియు రైతులు పాల్గొన్నారు.



నవీపేట్ : విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

జయశంకర్ ఆచార్య ప్రతిభ పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలో 2023 సంవత్సరంలో పదో తరగతిలో పాస్ అయిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ డివిజన్ల వారీగా ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభ పురస్కారాలు ప్రధానం చేయనున్నట్లు విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవపురం గోపాలకృష్ణాచార్య బుధవారం తెలిపారు. ఆర్మూర్ డివిజన్లో 28న నిజామాబాద్ డివిజన్‌లో 29న బోధన్ డివిజన్‌లో 30న ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్మూర్ 9 4 90006312, బోధన్ 9502921864, నిజామాబాద్ 9490019971 నంబర్లకు ఆయా డివిజన్లోని గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణ పిల్లలు తమ షాట్ మెమో, ఆధార్ కార్డు, వాట్సాప్ ద్వారా వివరాలు పంపగలరని తెలిపారు.. మరింత సమాచారం కోసం పైనంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ కేసు నమోదు అయినట్లు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయినాథ్ బుధవారం తెలిపారు. నిజామాబాద్ నాగారం నివాసి అయిన పురం శెట్టి నిఖిల్ (29) అప్పుల విషయంలో తన భార్యతో ఇంట్లో గొడవపడి, అప్పుల బాధ భరించలేక ఈనెల 22న రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. తండ్రి పురం శెట్టి గణేష్ ఐదవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్లాస్టిక్ నివారణ లక్ష్యం

నిజామాబాద్ ఫారెస్ట్ అధికారులు, సిరివెన్నెల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ చెత్త తొలగింపు



ప్లాస్టిక్ చెత్తను సేకరించిన అధికారుల, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్లాస్టిక్ నివారణ లక్ష్యమని నిజామాబాద్ ఎఫ్డిఓ రామ్ కిషన్ అన్నారు. బుధవారం నిజామాబాద్ ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా ఆదేశాల మేరకు నిజామాబాద్ ఫారెస్ట్ ఎఫ్డిఓ, ఎఫ్ఆర్ఓలు పద్మారావు, ఫారెస్ట్ అధికారులు సిబ్బందితోపాటు సిరివెన్నెల గ్రీన్ సొసైటీ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సారంగాపూర్‌లోగల అర్బన్ పార్క్ నందు ప్లాస్టిక్‌తోపాటు అర్బన్ పార్క్‌లో ఉన్న చెత్తను కూడా తొలగించారు. ఈ సందర్భంగా ఎఫ్డిఓ రామ్ కిషన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ ప్రజలు కూడా ప్లాస్టిక్‌ను నివారించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తమ పరిధిలో ఉన్నటువంటి పార్కులను కూడా ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సిరివెన్నెల గ్రీన్ సొసైటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు జనార్ధన్ ఫారెస్ట్ అధికారులు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ప్రతాప్ జహూర్, భాస్కర్, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి , ఎమ్మెల్యేలపై అసత్య ప్రచారం మానుకోవాలి

• బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-వేల్పూర్

మంత్రి, ఎమ్మెల్యే లు నియోజకవర్గంలో ఉండటం లేదంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అంటున్నారని, నియోజకవర్గంలో అభివృద్ధి కనబడటం లేదా.. అని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. కోమనిపల్లి గ్రామ రోడ్డు స్థానిక మంత్రి వేసిన డబుల్ రోడ్డు అని, నియోజకవర్గంలో ఉంటూ ప్రజా సమస్యలు తీరుస్తూ అభివృద్ధి పనులు చేస్తూ ఉంటే కనబడటం లేదా.. అని ప్రశ్నించారు. మండలంలో అర్హత కలిగిన పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇచ్చామని, ఏమైనా అనుమానం ఉంటే తమతో వస్తే డబుల్ బెడ్ రూమ్ వారి ఇంటికి పోయి అక్కడే భోజనం చేసి వద్దామని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో కోమన్‌పల్లి గ్రామానికి అనిల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒకటి రెండు సార్లు వెళ్లారని, మంత్రి అదే గ్రామంలో 11సార్లు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ విషయంలో చర్చకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా.. అని సవాల్ చేశారు. బీఆర్ ఎస్ మండలఅధ్యక్షులు నాగాధర్, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యులు మిట్టపల్లి మహిపాల్, జిల్లా ఆర్‌టీఏ మెంబర్ రేగుల్ల రాములు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ మహిపాల్, కోమన్‌పల్లి సర్పంచ్ పత్రీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి

• ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ దుర్గాప్రసాద్ కి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందించాలని యూనిఫామ్ అందించాలన్నారు.

వీటితోపాటు బాత్రూమ్స్, మంచినీటి సమస్యలు పరిష్కరించి విద్యా సంవత్సరం ప్రారంభించే లోపు ఎటువంటి సమస్యలు లేకుండా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని కోరారు.

వీటితోపాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు హంగు ఆర్భాటాలతో ఎక్కడో వచ్చిన ర్యాంకులను తమ బ్రాంచ్‌లో వచ్చిన ర్యాంకులుగా తప్పుడు ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారని, ఇటువంటి మోసాలను అరికట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో హాజరు పెరగాలంటే టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులభర్తీతోపాటు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బోడ. అనిల్, నగర కార్యదర్శి మహేష్, నాయకులు గణేష్, సందీప్, అజాద్ తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ గ్రామఅభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ 2023-24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల భాజన్న, కార్యదర్శిగా తోపారపు గంగాధర్ (గండోర్), న్యాయశాఖ సదార్‌గా అల్లకొండ గంగాధర్, ఉప సదార్‌గా పెసరి నారాయణ, కోశాధికారిగా సక్కారం నర్సారెడ్డి, దేవాదాయశాఖ సదార్ గా అంకడి రాజశేఖర్, నీటిశాఖ సదార్‌గా సింగారపు ఎల్లయ్య, అటవీశాఖ సదార్‌గా గోపు చిన్న ముత్తెన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం తమ వంతుగా పాటుపడతామని పేర్కొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ప్రభుత్వం పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరునికి ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ కమ్మర్ పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో వినతిపత్రం అందించినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి వినతి పత్రం అందజేశామని పార్టీ మండల అధ్యక్షుడు కైలాష్ మహారాజ్ తెలిపారు. భారత రాజ్యాంగం గ్రంథం పట్ల నూటికి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలమై పోతుందన్నారు. దీనివల్ల ప్రజా జీవితం అన్ని రంగాలలో అభివృద్ధి లేక అధోగతి పాలైతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ గ్రంథం విశిష్టత ప్రతి పౌరుడికి తెలిసేలా ప్రభుత్వాలే ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్ మండల అధ్యక్షుడు ఉమేష్ మహరాజ్, నాయకులు మోహన్, ఇందూర్ రాజు, రాజేశ్వర్, రావణ్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి



సమ్మెలో కూర్చున్న వీవోఏలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వీవోఏల కనీస వేతనం అమలు చేసి సెర్ప్ హెచ్ఆర్ పాలసీని వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ వి.వో.ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక ధర్నా చౌక్ లో 31వ నిరవధిక సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఐకెపి వివో ఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. అలాగే పది లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని, ఐడి కార్డులు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఐకెపి వివో ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం సుదర్శన్, కోశాధికారి ఎం.డి నయీమ్, ఉపాధ్యక్షురాలు అరుణ, ప్రవళిక ,మురళి,సరళ, నాగరాజు,మంజుల, నాల్కల్ గంగమని, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని నగేష్ రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సళ్ళ గంగారెడ్డి మాతృ మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట డిచిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, గుడి నరేందర్, రాజన్న, మాజీ ఎంపీపీ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలి

• ఐసీడీఎస్ పీడీతో చర్చించిన యూనియన్ నాయకులు



పీడీని సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాకు కొత్తగా వచ్చిన ఐసిడిఎస్ పీడీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించటంతో పాటు జిల్లాలో అంగన్వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ప్రధానంగా బియ్యం, గుడ్లు, పప్పులు, నూనె అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో చేర్చకపోవటంతో లబ్ధిదారులకు అందించలేక పోతున్నామని వారు తెలిపారు. రోజువారి పని ఒత్తిడి ఉండటంతో పాటు ప్రభుత్వం బీఎల్ఓ డ్యూటీలను వేయటం మూలంగా అటు ప్రీ స్కూల్ నడపటం, రోజువారి ఆన్ లైన్ రిపోర్ట్ లు పంపటం ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. బీఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. సెంటర్ అద్దెలను, డిఏలను నెలనెలా చెల్లించాలని తెలిపారు. అంగన్వాడి సమస్యలను పరిష్కరించటానికి తన వంతు సహాయం చేస్తానని పీడీ యూనియన్ నాయకులతో తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులు కే దేవగంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి స్వర్ణ, జిల్లా కోశాధికారి చంద్రకళ, జిల్లా ఉపాధ్యక్షులు మంగాదేవి జిల్లా నాయకులు పి వాణి, సరిత, జ్యోతి, గోదావరి , ప్రాజెక్టుల నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంలో న్యాల్కల్ గ్రామం ముందుంది

• డీఎల్‌పీవో నాగరాజు

• జీపి రికార్డులు, నర్సరీ పరిశీలన



జీపీలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలో న్యాల్కల్ గ్రామాన్ని డిఎల్‌పీవో నాగరాజు సందర్శించారు. మొదటగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డ్స్ పరిశీలించారు. గ్రామంలో గల నర్సరీని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ సెంటర్‌ను కూడా విజిట్ చేసి ఏఎన్ఎం, ఆశావర్కర్లకు సూచనలు చేశారు. గ్రామంలోనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. గ్రామంలోని తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయడం, దాని వల్ల లభించిన ఎరువుని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కడ కూడా చెత్త లేకుండా పారిశుధ్యంలో న్యాల్కల్ గ్రామం ముందు వరుసలో ఉందని సర్పంచ్ గంగా ప్రసాద్‌ను అభినందించారు. దశాబ్ది ఉత్సవాలకు తమ గ్రామంలో తయారు చేసిన కంపోస్ట్ ఎరువును మహిళా సంఘాల అందరికీ అందించే విధంగా చూడాలని, దాని ఉపయోగం గురించి తెలియజేయాలని సూచించారు. సర్పంచ్ గంగా ప్రసాద్ డిఎల్పిఓ నాగరాజుకు కంపోస్టు ఎరువు బ్యాగును బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సతీష్, ఎంపీటీసీ లక్ష్మీ గంగారం, గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రహదారిపై ధాన్యం లారీ బోల్తా



లారీ బోల్తాపడడంతో రోడ్డుపై పడిన వడ్ల సంచులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని నడ్పల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద 659 బస్తాలతో వెళ్తున్న వరి ధాన్యం లారీ అదుపు తప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. ఖిల్లా సహకార సొసైటి పరిధిలోని 659 వరి సంచులను నింపుకుని కోటగిరి మండల కేంద్రంలోని బాలాజి రైస్ మిల్ కు తీసుకుని వెళ్తండగా లారి అదుపు తప్పి పడి పోయింది. విషయం తెలుసుకున్న డిచ్ పల్లి సహకార సొసైటీ సీఈఓ కిషన్ చేరుకుని వరి ధాన్యం బస్తాలను ఇంకో లారీలో తరలించారు. లారి బోల్తా పడడంతో రాహదరిపై ధాన్యం బస్తాలు చెల్లా చెదరుగా పడిపోయాయి.

కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యం

జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్

కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల సంక్షేమం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కోమన్ పల్లి గ్రామంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ వేల్పూర్ మండలానికి వచ్చినప్పుడు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ఇవ్వలేదని, మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 500 రూపాయలకు సిలిండర్ ఇస్తామని, వరి పంటకు 2500 రూపాయల గిట్టుబాటు ధర ఇస్తామని, 2 లక్షల రుణమాఫీని ఒకే దఫాలో చేస్తామని హామీ ఇచ్చారు.

సైనికుడు రాడే మహేష్‌కు నివాళ్లు

మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుడు ర్యాడే మహేష్ విగ్రహానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన ర్యాడే మహేష్ దేశ ప్రజల మనసులో చిరకాలం నిలిచిపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్, నరేష్, రాజేశ్వర్, భూమారెడ్డి, దామోదర్ గౌడ్ తదితరులున్నారు.

నల్లమల గిరిప్రసాద్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిపిఐ జిల్లా కార్యాలయంలో గిరిప్రసాద్ 26వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండి విద్య రంగ సమస్యలపై, తర్వాతి కాలంలో ప్రజా సమస్యలపై ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకి పట్టి నల్లమల గిరిప్రసాద్ పోరాటం చేయడం జరిగిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఖమ్మం శాసనసభ్యులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా రాజ్యసభ సభ్యులుగా రాజ్యసభలో కమ్యూనిస్టు పక్ష నాయకుడిగా ప్రజాసమస్యలపై గొంతెత్తిన నాయకుడని అన్నారు. ఆయన కోరుకున్న సమసమాజ స్థాపన ఏర్పడినప్పుడే ఆయనకు అసలైన నివాళి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు రంజిత్, రఘురాం మరియు రమేష్, ఆనంద్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలి

• బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈఎస్ఐ హాస్పిటల్ ఔవుట్సోర్సింగ్ కార్మికులకు ఆరు నెలల బకాయిల వేతనాలు చెల్లించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దండివెంకట్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆరు నెలల నుండి వేతనాలు లేక అనే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని వేతనాలు ఇప్పించాలని కోరారు. పేదలైన ఔట్ సోర్సింగ్ కార్మికులు ఇంటి కిరాయి కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, ఐదు నెలలుగా ఇంటి కిరాయి కట్టలేదని ఇంటి యజమానులు ఇల్లు ఖాళీచేయమడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. నిత్యావసర వస్తువులు, బీపీ షుగర్ మందులు కొనలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, నెలనెలా వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర కార్యదర్శి గంగా శంకర్, జిల్లా కమిటి సభ్యులు ఎల్.గోపినాథ్, ఈఎస్ఐ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రావణ్, మునీర్, యాదమ్మ, గుండమ్మ మిగత కార్మికులు పాల్గొన్నారు.

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రీ సొసైటీ పరిధిలోని మంతిని, మగ్గిడి, ఖానాపూర్, పిప్రి గ్రామాల రైతులక గురువారం జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి బుధవారం తెలిపారు. రెండున్నర ఎకరాలు ఉన్న రైతుకు ఒక బస్తా, 2:30 నుండి 5 ఎకరాలు ఆపై ఉన్నవారికి రెండు బస్తాలు ఇవ్వబడునని పేర్కొన్నారు. బస్తా ధర 8 4 5 రూపాయలు అని తెలిపారు. రైతులు పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ ,ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు..

వైభవంగా శ్రీ ఆంజనేయ ఆలయ శిఖర ప్రతిష్టాపన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్టాపన బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ఆడబిడ్డల సహాయ సహకారాలతో ఆలయ శిఖరం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 450 మంది ఆడబిడ్డలకు తపుకు మాణిక్యాలను, ఆలయ కమిటీ కానుకగా అందజేసింది. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు, యువత, సమైక్యంగా ఈ వేడుకలను విజయవంతంగా పూర్తి చేసినట్టు వారు పేర్కొన్నారు.

ఆనందిదం జాతిస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని కంబాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం నిర్వహించి లబ్ధిపొందాలని సూచించారు. ఎండలు మెండుగా ఉన్నందున కూలీలందరూ ఉదయం పూటనే పనులు నిర్వహించి వెళ్లాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కూలీరేట్లను అధిగమించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాల దరఖాస్తులకు నేడు గడువు

నవతెలంగాణ-సదాశివనగర్

పదో తరగతి ఉత్తీర్ణులైనవారు సదాశివనగర్ మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరాలనుకునే వారు 25వ తేదీ గురువారం చివరి రోజు అని ప్రిన్సిపాల్ భానుమతి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలను www.tsmodelschools.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

26 నుంచి 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన..

మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాసి అడ్మిషన్‌కు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈనెల 26 నుంచి 31వ తేదీవరకు పరిశీలించుకోవాలని కోరారు. ఇదివరకే ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ వారి నుంచి సమాచారం అందిందని ఆ విద్యార్థులు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని, కులం, ఆదాయం, టీసీ, భోనాఫైడ్, ఆధార్‌కార్డు తీసుకోవచ్చని, పరిశీలించుకోవాలని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన జేపీఎస్‌లు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి జేపీఎస్‌లు బుధవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇవ్వడంతో నిరవధిక సమ్మెను విరమింపజేశారు. కార్యక్రమంలో విండో చైర్మెన్ శివానంద్, ప్రజాప్రతినిధులు నీలు పటేల్, మాదారావ్ దేశాయి, చిన్నఎడ్గి శివాజీపటేల్, సర్పంచులు రవిపటేల్, బొంపెలి రాములు, జేపీఎస్‌లు, ఎంపీడీవో నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-మద్నూర్

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ అధికారులు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దఎక్లారా, మేనూర్, మద్నూర్ గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో గల ఫర్టిలైజర్ విత్తన అమ్మకాల దుకాణాలను తనిఖీలు చేపట్టి దుకాణాల్లో గల విత్తనాలు రసాయన ఎరువులు పరిశీలించారు. విత్తనాలు అమ్మే డీలర్లకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఏవో సుధాకర్, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో యజ్ఞం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని న్యాయవాది ప్రాంతంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం నిర్మాణ పనులు పూర్తిచేసుకుని మంగళవారం ప్రారంభోత్సవం జరిగింది. బుధవారం ఉదయం వేద పండితుల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌడిన్యగౌడ సంఘం పెద్దలు నటరాజ్ గౌడ్, శేఖర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి/వర్ని

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. మండల పరిధిలోని రైతు సోదరులకు గురువారం నుంచి గాంధారి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గాంధారి, ముధోలి, గాంధారి అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేయనున్నట్టు సూచించారు. రైతులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

వర్ని(చందూర్) : మండలంలోని ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలు, బీపీటీ సీడ్ విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం రైతుల ఖాతాలో సకాలంలో నగదు జమ చేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్లం సాయరెడ్డి, ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, ఉప సర్పంచ్ ఎల్లమ్మల శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ మేడిపల్లి జ్యోతి సాయిలు, సొసైటీ డైరెక్టర్‌లు కల్లూరి రాంరెడ్డి, భజన్‌లాల్, ఒడెన్న, ఉమర్, మేడిపల్లి సాయిలు, సీఈఓ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని టీకారాం తండాలో బీఆర్ఎస్‌కే ఆధ్వర్యంలో అంగన్వాడీ చిన్నారులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మమత మాట్లాడుతూ.. ప్రతిరోజు తాము ఆర్‌బీఎస్‌కే ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే టీకారాంతాండ అంగన్వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి పదిమంది చిన్నారులకు మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. మరో ఇద్దరు చిన్నారుల్లో ఒకరికి పుట్టుకతో మాటలు రాకపోవడం,. చెవులు వినక వినబడకపోవడం లాంటి సమస్యలు ఉన్నందున వీరిని నిజామాబాద్ జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అర్జున్, ఫార్మసిస్ట్ యాదగిరి గౌడ్, అంగన్వాడీ కార్యకర్త గోదావరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రుణం మంజూరులో రాజకీయం

- చందూర్‌లో మైనార్టీ రుణాలపై రాజకీయ ఒత్తిళ్లు

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కొరకు మైనార్టీ కార్పొరేషన్ శాఖ ద్వారా యువత జీవనోపాధి పొందాలని లోన్‌లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా వర్ని ఉమ్మడి మండలంలో పలు యూనిట్లు మంజూరయ్యాయి. అయితే చందూర్‌లో మైనార్టీ రుణాలపై రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.



వర్ని మండలానికి 4 యూనిట్లు, రుద్రూర్ మండలానికి 4 యూనిట్లు, మోస్రా మండలానికి 1 యూనిట్, చందూర్ మండలానికి 2 యూనిట్లు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఉమ్మడి మండలంలో మూడు మండలాలకు చెందిన లబ్ధిదారుల లిస్ట్ మైనార్టీ కార్పొరేషన్‌కు వెళ్లాయి. చందూర్ మండలంలో మాత్రం రెండు యూనిట్లపై ఇప్పటికీ కొలిక్కి రాక లబ్ధిదారులు చెప్పులరిగేలా తిరుగుతున్నట్టు తెలుస్తోంది. కార్పొరేషన్‌కు అప్లై చేసుకున్న వారిలో ఇద్దరిని ఎంపిక చేసి బ్యాంకు వారితో ఒకే అయినప్పటికీ రెండు యూనిట్లను నలుగురికి పంపిణీ చేయాలని అందుకు ఎంపికైన ఇద్దరిని ఒప్పించడానికి రాజకీయ నాయకులు ఒత్తిడి చెయ్యటంతో లబ్ధిదారులు మనోవేదన చెందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు లబ్ధిదారులు తమ యూనిట్‌కు సరిపోవని ఎలా యూనిట్‌ను నడుపుకోవాలని తెలుపుతున్నా తమ వ్యక్తులకు ఇవ్వకుంటే అధికారులకు చెప్పి ఆపివేస్తామని ఆదేశిస్తున్నట్టు వినిపిస్తోంది. పలు మండలాల్లో మైనార్టీ లోన్ విషయంలో నాకంటే నాకు అంటూ స్పీకర్ వరకు సమచారం తీసుకెళుతున్నారు. దీంతో లబ్ధిదారులు లోన్ ఎవరికి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇద్దరికే ఇస్తాం

మైనారిటి లోన్ విషయంలో ఇతరులకు కుడా ఇవ్వాలని ఒత్తిడి ఉన్నా, అధికారికంగా తాను మైనార్టీ లోన్‌కు ఎవరి పేర్లైతే పంపామో వారికే ఇస్తాం. అసలైన లబ్ధిదారులకు ఇవ్వటంలో తాము సిద్ధంగా ఉన్నాం. ఎవరి ఒత్తిడిలకు లొంగేది లేదు. ఇప్పటికే ఆలస్యం అయ్యింది వాస్తవం. రెండు రోజుల్లో లిస్టు మైనారిటీ శాఖ అధికారులకు పంపిస్తాం. - ఎంపీడీఓ

29న ఎల్లారెడ్డికి మంత్రి హరీష్‌రావు రాక

- సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

ఎల్లారెడ్డి పట్టణ చిరకాల కోరిక ఎట్టకేళకు ఎల్లారెడ్డి పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ శంకుస్థాపనకు ఈనెల 29 ఆదివారం మంత్రి హరీష్‌రావు ఉదయం 11 గంటలకు ఎల్లారెడ్డికి వస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీ బీబీ పాటిల్, జిల్లా నాయకులు తదితరులు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నట్లు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారా యణ తెలిపారు. బుధవారం శంకుస్థాపన చేసే ఆసుపత్రి ఆవరణలో శిలాఫలకానికి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే..

లింగంపేట్ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన గల సభాస్థలాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 28 ఆదివారం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు, బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు విచ్చేస్తుండటంతో మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ పక్కన మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సభను పెద్దఎత్తున నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఎంతమంది కార్యకర్తలు నివేదిక ప్రాంగణం అవసర పడుతుందో స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వాహనాల పార్కింగ్ కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా సభా ప్రాంగణం ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. కార్యకర్తల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయడానికి మండల ప్రజాప్రతినిధులకు, పార్టీ ప్రతినిధులకు, కార్యకర్తలకు సూచించారు. మండలంలోని కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ సమాచారం అందించి పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చెయ్యాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ గరీబున్నిసా నయీం, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నరహరి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ కూలి రేట్లను అధిగమించాలి

నవతెలంగాణ-పిట్లం

ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం సూచించిన కూలి రేట్లు అధిగమించాలని జిల్లా పీడీ ఆఫీస్ ఫైనాన్స్ మేనేజర్ రామ్ నారాయణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల ఈజీఎస్ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు నిర్వహించకపోవడం మూలాన ప్రభుత్వం నిర్దేశించిన కూలి రేట్లను అధిగమించడంలో కూలీలు వెనుకంజ వేయటం వల్ల ఒక్కొక్కరికి ఒక రోజుకు రూ.140 నుంచి 150 వరకు చెల్లించవలసి వస్తుందని అన్నారు. ఉపాధి హామీ సిబ్బంది కృషిచేసి కొలతల ప్రకారం పనులు చేయించి కూలీలకు నిర్దేశించిన 272 రూపాయలు వచ్చేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పెద్దకొడప్‌గల్ ఎంపీడీవో రాణి, ఏపీవోలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ జనార్ధన్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ అల్లే జనార్దన్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న (మక్క) కొనుగోలు కేంద్రాన్ని సాలూర సొసైటీలో ఏర్పాటు చేసిందని, కావున రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్వింటాలు మొక్కజొన్నకు ప్రభుత్వం 1962 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ఏఈఓ నుంచి పంట నమోదు ధృవీకరణ పత్రం, పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సు తీసుకుని పంట విక్రయించాలని సూచించారు. ఎకరానికి 26.70 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. సొసైటీ కార్యదర్శి బస్వంత్‌రావు, డైరెక్టర్ గంగారా, నూర్ ఆహ్మద్, సంజీవ్, ఖాజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన షెకెల్లి రాజయ్య (54) అశోక్ లీలండ్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

27న నియోజకవర్గ స్థాయి రైతు సదస్సు

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న స్పీకర్ పోచారం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలో ముందస్తు పంటల సాగుపై ఈ నెల 27న నియోజకవర్గ స్థాయి రైతులకు రైతు సదస్సు నిర్వహించనున్నామని, ఈ సదస్సుకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని నెమ్లి సాయిబాబా కళ్యాణ మండపంను ఆర్డీఓ రాజగౌడ్ , వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి విజయ్‌కుమార్, స్పీకర్ వ్యక్తిగత సహాయకులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ..



మండపాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి సాయిబాబా మందిరం వెనుక కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ముందస్తు పంటల సాగుతో రైతులు ప్రకృతి వైపరీత్యాలతో తప్పించుకోవచ్చుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు అవగహన కల్పిస్తారని తెలిపారు. వీరి వెంట ఎంపీపీ పాల్త్య విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, జిల్లా రైతు నాయకులు అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కిష్టారెడ్డి, సర్పంచ్ ఫోరం కన్వీనర్ రాము తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో గల అయ్యప్ప మందిర ప్రాంగణంలో షటర్ల నిర్మాణం కోసం జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తోట లక్ష్మీకాంతరావు అయ్యప్ప సేవ ట్రస్ట్ సభ్యులకు రూ. లక్ష విరాళం అందజేశారు. మంగళవారం రాత్రి అయ్యప్ప మందిరంలో అయ్యప్ప సేవ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ముందుగా తోట లక్ష్మీకాంతరావుకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ గత డిసెంబర్‌లో నిర్వహించిన మహా పడిపూజలో తన ద్వారా లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించి నగదు రూపంలో విరాళం అందజేయడం జరిగిందన్నారు. అయ్యప్ప మందిర అభివృద్ధికి తన వంతు కృషి, సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు జయప్రదీప్, అధ్యక్షులు అస్పత్ వార్ అశోక్, ఉపాధ్యక్షులు హాజీబాబ్రాజ్, రమణ, పత్తిలక్ష్మణ్, నౌషానాయక్, విట్టల్, విజయ్, గజానన్ పంతులు, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

31వ రోజుకు వీవోఏల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-రెంజల్/వర్ని

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 31వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడం శోచనీయమని సంఘం అధ్యక్షులు గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు సహాయ సహకారాలు అందిస్తూ వారి ఆర్థికంగా బలోపేతానికి సహకరిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారాలు అందలేదన్నారు. చాలీచాలని గౌరవ వేతనంతో తమ బతుకులను వెల్లదీయడం భారంగా మారిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీవోఏలకు కనీసం రూ.18 వేలు గౌరవ వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలోని వీవోఏలు పాల్గొన్నారు.

31వ రోజుకు ఐకేపీ వీవోఏల సమ్మె

వర్ని : ఉమ్మడి వర్ని, చందూర్ మండలాల వీఓఏల సమ్మె 31వ రోజుకు చేరింది. నిరవధిక సమ్మెలో భాగంగా పలు గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

డిమాండ్‌లు పరిష్కరించే వరకూ సమ్మె

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గ్రామాల మహిళ సంఘాలకు సంబంధించిన వీవోఏల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె కొనసాగిస్తున్నామని ఐకేపీ ఏపీఎం సత్యనారాయణకు వీవోఏలు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.పది లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా చేయాలన్నారు. గౌరవ వేతనాన్ని డీఆర్డీఏ నుంచి ఖాతాలో చెల్లించాలని, జీవో 56ను సవరిస్తూ జీవో 5ను రద్దు చేయాలని డిమాండ్ పత్రంలో పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కురుమ యువ చైతన్య సమితి మాచాపూర్ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని మాచాపూర్ గ్రామ నూతన కురుమ కార్యవర్గాన్ని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ కురుమ ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కురుమ సాయిబాబా అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు మునిగేపల్లి సంగయ్య, జిల్లా కోశాధికారి కోడూరి దావిడ్, జిల్లా కార్యదర్శి నార్ల మల్లేష్, నాగిరెడ్డిపేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తమాల సిద్ధు, కిష్టన్న, మాచాపూర్ కురుమ రవి తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గసభ్యులుగా గ్రామ అధ్యక్షుడు కురుమ అంజయ్య, ఉపాధ్యక్షుడు కురుమ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కురుమ సాయిలు, ప్రధాన కార్యదర్శి కురుమ అశోక్, కార్యదర్శి దుర్గయ్య తదితరులు ఎన్నికయ్యారు.



ఎన్నికైన గ్రామ కమిటీ

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం గ్రామాలలో డీఆర్డీఏ పీడీ చందర్‌నాయక్ బుధవారం ఉపాధి హామీ పనులతో పాటు, నర్సరీలను ఆయన పరిశీలించారు. తాడ్‌బిలోలి నర్సరీలో మొక్కలు చాలా బాగున్నాయని, కరివేపాకు, వేప మొక్కలను తీసుకురావాలని క్షేత్ర సహాయకుడు మధును ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలని, వేసవిలో వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఇన్చార్జి ఏపీఓ శరత్‌చంద్ర, క్షేత్ర సహాయకులు మధు, హర్షత్ భాష, తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ

కంటి వెలుగును పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-వర్ని

మండలంలోని అపందిపాలెం తాండ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ప్రజలకు అన్ని రకాల కంటి సమస్యలను పరీక్షించి కంటి అద్దాలు అందేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం, శిఖర ప్రతిష్టాపనకు బీజేపీ నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులు ఐకమత్యంతో ఆలయ పున:నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో దేవాలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. వారి వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ తీరుపై తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు

నవతెలంగాణ- నవీపేట్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ న్యాలకంటి అబ్బన్న తీరుపై దర్యాపూరు రైతులు తహసీల్దార్ వీర్‌సింగ్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు నవీపేట్ మండల కేంద్రంలోని దర్యాప్తు శివారు రైల్వే గేట్ సమీపంలో మూడు రోజులుగా ధాన్యం తూకం చేయడం లేదని సొసైటీకి వెళ్లి కొందరు రైతులు ప్రశ్నించగా గల్లా పట్టి బయటకు నూకేస్తా, పోలీసులకు చెబుతానని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సహకరించాల్సిన సొసైటీ చైర్మన్ రైతులను ఇలా అవమానించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రైతులపై దురుసుగా ప్రవర్తించిన చైర్మన్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఎనిమిదో వార్డులో కూలిన కల్వర్టు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో ఉన్న 8వ వార్డులో డ్రైనేజ్‌పై ఉన్న కల్వర్ట్ కూలిపోయిందని, దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులు డ్రయినేజీ కాలువపై ఉన్న కల్వర్ట్‌ను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. 20 రోజులైనా ఎవరూ దీనిపై స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులు వచ్చి కూడా చూసీచూడనట్టు వెళ్లిపోతున్నారని ఎనిమిదో వార్డ్ సభ్యులు చర్చించుకుంటున్నారు. త్వరగా డ్రైనేజ్‌పై ఉన్న కల్వర్ట్ నిర్మించే విధంగా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కార్యకర్తలే పార్టీకి పునాదులు

- టీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

కార్యకర్తలే పార్టీకి పునాదులు-కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ హామీ ఇచ్చారు

నిజామాబాద్ రూరల్ మండలంలోని పవార్ గార్డెన్లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. బిజెపి, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రతి కార్యకర్త తిప్పి కొట్టాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నామని, నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి 6 నుంచి 7 కోట్ల నిధులను సిసి రోడ్లు, డ్రైనేజీలు, మహిళా సంఘాలు, కమ్యూనిటీ భవనాలు, విద్యుత్ దీపాలకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మతం పేరుతో విద్వేషాలు సృష్టిస్తున్న బీజేపీ పార్టీని బొంద పెట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు. అబ్కీ బార్ కిసాన్ సర్కారు నినాదం ఎత్తుకొని దేశం కోసం బయలెల్లిన పార్టీ పైన కేంద్రంలోని బీజేపీ పార్టీ బరితెగింపు దాడులు చేస్తూ.. తెలంగాణ ప్రగతిని అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజి గంగాధర్ గౌడ్ , జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న విట్టల్ రావు, ఐడీసీఎంఎస్ ఉమ్మడి జిల్లాల చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ బానోత్ అనుషా ప్రేమ్ నాయక్ , జెడ్పీటీసీ బొల్లిలంక సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ సొసైటీ చైర్మన్ జితెందర్, పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు,ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

కిక్ బాక్సింగ్ విజేత శ్రీకాంత్‌కు జుక్కల్ ఎమ్మెల్యే సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలో డోంగ్లి మండలానికి చెందిన శ్రీకాంత్ గత నెల నేషనల్ కిక్ బాక్సింగ్ జమ్ము కాశ్మీర్‌లో జరిగిన గేమ్స్‌లో సిల్వర్ మేడల్ సాధించారు. బాక్సింగ్ విజేత అయిన శ్రీకాంత్‌కు జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గానికి చెందిన యువతీ యువకులు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో డోంగ్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్, మదన్‌హిప్పర్గ సర్పంచ్ రాజు పటేల్, ఇల్లేగావ్ సర్పంచ్ కుమారుడు చాంద్ పటేల్, మల్లాపూర్ సర్పంచ్ కుమారుడు వీరేశం, ధోతి సర్పంచ్ కాశీనాథ్ పటేల్, మోగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న పలువురు

చిన్నారికి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ అందజేత

ఆపదలో ఉన్నవారికి మంత్రి వేముల భరోసా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



బాల్కొండ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న పేద వారికి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. అనారోగ్యం బారిన పడి మంత్రి దగ్గరికి వచ్చిన వారికి వ్యక్తిగతంగా ధైర్యం చెప్పడమే కాకుండా ఆర్థిక సహాయం కూడా చేస్తూ భరోసా కల్పిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఎం.హరిచందన అనే 8 ఏళ్ల చిన్నారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతుంది. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా ఆమెను హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో జాయిన్ చేయించి చికిత్స కొరకు రూ.2 లక్షల 50వేల ఎల్ ఓసి మంజూరు చేయించారు. ఎల్ఓసి కాపీని బుధవారం చిన్నారి తండ్రి భాస్కర్ గౌడ్‌కు మంత్రి అందజేశారు. ప్రశాంత్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆయన అన్నారు.

బోరు మోటర్ తవ్వకం ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి హరిజనవాడలో నీటి కొరత ఉందని తెలుసుకొని, భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి తన సొంత ఖర్చుతో బుధవారం బోరు తవ్వకం ప్రారంభించినట్లు ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల తరపున వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిన్న శంకర్, ఆకుల స్వామి, బుడ్డ రవి, బాబు, వార్డు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతినెల 24న నిక్షయ్ దివస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతినెల 24వ తేదీన నిక్షయ్ దివాస్ అనే కార్యక్రమాన్ని జరుపుకొంటున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం తెలిపారు. టీబీ రోగులలో భరోసా కల్పించడానికి బుధవారం జిల్లా కేంద్రంలోని అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో వాల్ పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ యం సుదర్శనం మాట్లాడుతూ.. టీబీరోగులకు ఒంటరి అనే భావన రావద్దనే ఉద్దేశం తో మందులు వాడుతున్న వారితో ఇలా పెయింటింగ్ వేస్తూ వారు పొందుతున్న సేవలు అర్థమయ్యేలా బొమ్మల రూపంలో ఉన్నాయని తెలిపారు. టిబి మందులు వాడుతున్న వారు ఇతరులకు ఈ వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త పడేలా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్యేశ్యం అని అన్నారు. 15 మంది టిబి రోగులు కలిసి ఈ పెయింటింగ్‌ని పూర్తి చేశారని తెలిపారు. కార్యక్రమంలో అర్సపల్లి మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, జిల్లా టిబి కోఆర్డినేటర్ రవిగౌడ్, హెచ్ఈఓ ముక్తార్ హుస్సేన్, కమ్యూనిటీ ఆఫీసర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మధుకర్, హెల్త్ విజిటర్ విజయమాల, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ డివిజనల్ అధికారి బదిలీ

నవతెలంగాణ- ఆర్మూర్

రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు బదిలీ అయ్యారు..2018 సంవత్సరం సెప్టెంబర్ 5న ఆర్మూర్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడకు రాకముందు నల్గొండ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టు భూసేకరణ అధికారిగా పనిచేశారు. శ్రీనివాసులకు ముందు పనిచేసిన ఆర్డీవో భలే శ్రీనివాస్ 2018 ఒకటవ నెలలో ఏసీబీకి పట్టుబడిన విషయం విధితమే. ప్రస్తుత ఆర్డిఓ స్థానంలో కొత్త వారిని నియమిస్తారా..? ఇంకెవరికైనా ఇంచార్జ్ బాధ్యతలు అప్పగిస్తారా ..? అనే ఉత్తర్వులు రావాల్సి ఉంది.

నాణ్యమైన విత్తనంతో లాభాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి అనే రైతు మల్లన్న సీడ్స్ వారి విత్తనాలు పెట్టి అధిక లాభాలను పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ మహేష్ సీడు ఇచ్చినట్టు19 ఎస్ 9 1 మొక్కను వేసి మంచి దిగుబడి పొంది లాభాలను పొందినట్టు తెలిపారు. పెట్టుబడి 20వేలు ఖర్చు పోయిన ఎకరానికి 70 వేల లాభం పొందవచ్చని, నాణ్యతకు మంచి పేరుగా ఉన్న ఈ సీడును రైతులు ఎన్నుకోవడం ఉత్తమమని, అంక్సాపూర్ గ్రామానికి చెందిన లారీ మల్లారెడ్డి పెట్టి అధిక లాభాలు పొందినట్టు తెలిపారు. రైతంగానికి ఎంతో లాభాలు వస్తాయని ఆయన తెలిపారు.

